# మచ్చతేలిన చంద్రుడు

కథ

మండువేసవిలో గుక్కెడు నీళ్ళు కరువైన చోట మున్సిపాలిటీ వాటర్ టాంక్‌లా ఆగింది రాజమండ్రి నుంచి ఏలూరు వెళ్తున్న బస్సు నిడదవోలులో. దాని చుట్టూ బిందెలతో మూగినట్లుగా తమ తమ లగేజీలతో చేరారు జనం.

''ఏమండీ! కొంచెం మీ ప్రక్కన ఈ రుమాలు వేయరూ?''

''ఈ టవల్ మీ వెనుక సీట్లో వేయండి. ముగ్గురం. ప్లీజ్!''

''సోడా...నిమ్మసోడా!''

''మూర రెండు రూపాయలు బాబూ! మల్లెపూలు సార్...మల్లెపూలు'' లాంటి అరుపులతో చెవులు గళ్లడిపోతున్నాయి.

టూ సీటర్‌లో డోర్‌వైపు కూర్చున్న నేను నా హేండ్ కర్చీఫ్‌నే ప్రక్కసీట్లో వేశాను. ఎవరైనా డిగ్నిఫైడ్ పర్సన్‌కి సీటు ఇవ్వవచ్చుననే ఉద్దేశ్యంతో.

భగీరధుడికి ఆఖరి క్షణంలో తపస్సు ఫలించిన క్షణంలా నా వేటలో బస్సెక్కిన ఆ మెరుపుతీగ అందమూ, ఆకర్షణ నన్ను ఒక్క క్షణం కూడా వేస్టు చేయకూడదు అనిపించేటంతగా అచేతనుడిని చేశాయి. నిండైన దేవతామూర్తిలా ఉందామె. ఒక్క మాటలో చెప్పాలంటే అంత అందగత్తెను నేను ఎన్నడూ చూడలేదు.

''అంకుల్! ఇక్కడ ఎవరైనా ఉన్నారా?'' కిక్కిరిసిన జనం మధ్య సన్నని జాగాలోంచి నల్లని దుస్తులలో తన సౌందర్యమంతా బంధించిన ఆమెనే చూస్తున్న నేను ఉలిక్కిపడ్డాను.

అప్పటికే రెండుమూడుసార్లు అడిగిన ఆ అబ్బాయి ఇక నా పర్మిషన్ అవసరం లేనట్లుగా కూర్చున్నాడు.

బస్ స్టార్టయింది.

అందంగా వున్న ఆ అబ్బాయిని లెమ్మనలేకపోయాను. హేండ్‌కర్చీఫ్ తీసి చేత్తో పట్టుకున్నాను.

అందం నా ప్రాణం. అందమైన నా పేరంటే కూడా నాకు ఎంతో ఇష్టం.

నూటికి అయిదుగురు అందగాళ్లను సెలెక్టు చేస్తే ఖచ్చితంగా వారిలో నేనుంటాను.

నాకున్న కొద్దిపాటి బట్టతల, సొట్టలుపడే ఎర్రని బుగ్గలు, పచ్చని శరీరంపై మగటిమిని గుర్తు చేసే రోమాలు, తెల్లని పలువరుస, తళుక్కుమనేలా ఎటువంటి అలవాటు లేని లేత గులాబీ పెదవులు, 'భలేగా వుందే' అనిపించేలా ఉండే జంట జలగల మీసం...ఇదీ నా అందం.

ఇన్‌షర్టులో వున్న నేను వెనుక జేబులోని దువ్వెన తీసుకుని ఒకసారి ఉన్న (బట్ట)తలను దువ్వుకున్నాను ఆమెను గమనిస్తూనే.

ఆమె వెనుదిరిగి బస్సంతా కలియజూసింది. సరిగ్గా ఆమె చూపు నామీద నిలిచిపోయింది. ఎక్కడో నన్ను చూసిన దానిలా ఒక్కక్షణం మెరిసిన ఆమె చూపు సంతృప్తిగా నా చూపు నుండి విడదీసుకుని అటు తిరిగిపోయింది.

నా అంచనా కరెక్టు అయితే ఆమె నడుముమీద రెండు సన్నని మడతలు ఆమెకు ఇద్దరు పిల్లలు అని తెలియజేస్తున్నాయి. ఆమె గుండెలపై వ్రేలాడుతున్న నల్లపూసల తావళంలోని లక్ష్మీదేవి 'నా అదృష్టానికి కుళ్ళిపో' అని శపిస్తున్నట్లుగా స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె ఇటు తిరిగినప్పుడల్లా ఆమెను తనలో దాచుకున్న నల్లని దుస్తులు బంగారు ఛాయలో మెరుస్తున్న ఆమె అందానికి మరింత బిగువునిస్తున్నాయి. కళ్లజోడు అందమైన ఆమె గుండ్రటి ముఖానికి అతికినట్లుగా సరిపోయింది.

ఆమె ఒబ్బిడితనమంతా తనలో దాచుకున్నట్లు నడుము దాటిన ఆమె పొడవాటి జడలో అప్పుడే విచ్చుకుంటున్న పందిరిమల్లెలు నన్ను చూసి వెక్కిరిస్తున్నట్లుగా నవ్వుతున్నాయి.

''అంకుల్! మీరే ఊరు వెళుతున్నారు?'' నా ప్రక్క బాబు జబ్బ పుచ్చుకుని గుంజడంతో అతనివైపు తల తిప్పాను.

''తాడేపల్లిగూడెం! అది సరేగానీ నువ్వు చాలా బాగున్నావు. నీ పేరు?'' అడిగాను నేను నవ్వుతూ.

''భార్గవ్‌రామ్! మీ పేరు?''

''చంద్రకుమార్! మీ ఫాదర్ ఏం చేస్తున్నారు?''

''ఏలూరులో పని చేస్తున్నారు బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా.''

''అచ్చా! ఏం చదువుకుంటున్నావు?''

''టెన్త్ క్లాస్! మీరేం చేస్తున్నారు అంకుల్?''

''ఎల్ఐసిలో.''

నేను సమాధానాలు చెప్తూనే ఉన్నా అంతమందిలో ఆమె నిలబడి నన్ను మురిపిస్తూనే ఉంది.

నాకే ఆమె మీద హక్కు వుంటే పాలమీగడ తరకలాంటి ఆమె అందాన్ని వేరే చెయ్యి కడగనవసరం లేనంతగా జుర్రేసేవాడిని.

''అబ్బా...అటేం చూస్తారు? నాతో కబుర్లు చెప్పండంకుల్!''

నేను ఉలిక్కిపడ్డాను.

నా వేటలో మొదటిసారి దొరికిపోయా. అదీ ఒక చిన్నకుర్రవాడికి.

అమ్మపిడుగా! నీకింత నాలెడ్జి వుందా? అనుకుంటూనే ప్రశ్నించాను.

''ఆంటీ చాలా బాగుంది కదూ?''

''మీలాగే!'' ఆ అబ్బాయి గలగలా నవ్వాడు.

మరోసారి ఉలిక్కిపడ్డాను.

ఆ బాబు భుజం చుట్టూ చేయివేసి ఆప్యాయంగా పొదివి పట్టుకున్నాను.

''నిజంగా నేను బాగున్నానా?''

''మా డాడీలా చాలా అందంగా ఉన్నారు.''

నిజంగా అతని డాడీని చూడకపోయినా ఒక్కక్షణం అతని చమత్కారానికి మెచ్చుకోకుండా ఉండలేకపోయాను.

సరిగ్గా ఆమె ఆ క్షణంలో నాకేసి చూసింది.

''నువ్వు నాకు చాలా నచ్చావు!'' ఆమెకేసి చూస్తూ ఆ అబ్బాయితో ద్వందార్ధంగా అన్నాను.

''అలాగా. ఏం? మీకు పిల్లలు లేరా అంకుల్?''

''ఓ.! ఒక అబ్బాయి, ఒక అమ్మాయి.''

''అయితే భయ్యా ఏం చదువుతున్నాడు, సిస్టర్ ఏం చదువుతోంది?''

ఆ అబ్బాయి కలుపుగోలుతనానికి ముచ్చటేసింది.

''బాబు నైన్త్, సిస్టర్ టెన్త్!''

''భయ్యా బాగుంటాడా? నాకన్నా అందంగా!''

''నీలాగే, నీ కలర్‌లోనే వుంటాడు'' తల నిమరబోయాను.

''ఇది హీరో వినీత్ స్టయిల్ అంకుల్. ప్లీజ్ ముట్టుకోకండి.''

''అచ్ఛా! మరి నీకు హీరోయిన్స్‌లో ఎవరిష్టం?'' అడిగాను ఆశ్చర్యం ప్రకటిస్తూ.

''ఛీ...హీరోయిన్స్ అంటే నాకిష్టం వుండదు అంకుల్. వాళ్లవల్ల సమాజంలో ఆడదానికి వున్న గౌరవం కూడా పోతోంది'' అన్నాడు పెద్ద ఆరిందాలా.

నవ్వొచ్చింది నాకు.

''పోనీలే. పెళ్లికాని అమ్మాయిలు బాగుంటారా? పెళ్లయిన ఆంటీలు బాగుంటారా?''

''ఏమో నాకేం తెలుసు?'' అని ఒక్కక్షణం ఆలోచించి అన్నాడు.

''మా అక్క ఉసూరుమంటూ వుంటుంది. మాకైతే మా మమ్మీయే బాగుంటుంది సరస్వతీదేవిలా.''

''అయితే ఆ ఆంటీలో నీకు ఏం నచ్చింది?'' తెలివిగా సంభాషణను నాకు కావాల్సిన వైపుకి మలుస్తూ అడిగాను.

''ఊ...అమ్మ. ఆ ఆంటీలో 'అమ్మ' నాకు నచ్చింది. అయినా ఇవేం ప్రశ్నలు అంకుల్. చిన్నపిల్లల్ని అడిగే ప్రశ్న

లేనా ఇవి?'' అని తల విసురుగా తిప్పి బయటకు చూడసాగాడు.

అంతలోనే నాకేసి తిరిగి ''సరేగానీ! మీరు తాడేపల్లి గూడెంలో ఎక్కడ ఉంటున్నారం కులే?''




''డఫేదార్ వీధిలో. దత్తసాయి నిలయం అని అడిగితే ఎవరైనా చెబుతారు.''

''అయితే నేనెప్పుడైనా సెలవులకి మీ ఇంటికి రావచ్చా అంకుల్?''

''ఓ...భేషుగ్గా!''

''భయ్యాతో, సిస్టర్‌తో ఆడుకోవచ్చా?''

''ఊ!''

''అయితే నాకు అడ్రస్ ఇవ్వరా అంకుల్!''

ఆ అబ్బాయి అడిగిన తీరుకి వెంటనే పర్సుతీసి నా విజిటింగ్ కార్డు అతనికిచ్చాను.

ఆ బాబు తన స్కూలు విశేషాలన్నీ చెబుతున్నాడు. నేను ఊ కొడుతూనే ఉన్నాను. ఆమె అందాన్ని ఆస్వాదిస్తూనే వున్నాను.

ఈ హడావుడిలో తాడేపల్లిగూడెం తాలూకా ఆఫీసు సెంటర్లో బస్సు ఆగడం జరిగింది.

''ఓకే బాబూ! మా ఇంటికి తప్పనిసరిగా రా!'' అ బాబు బుగ్గమీద చిటికేసి ముందుకు నడిచాను.

ఎలాగైనా ఆమెను ఒకసారి తాకాలన్న నా కోరిక అడియాసే అయింది.

ఆమెకు సీటు దొరికి కూర్చుంది. ఆమెను చూస్తూనే దిగబోయిన నేను కాలు స్లిప్ అయి పడబోయాను.

విసురుగా ముఖం తిప్పుకున్న ఆమె చెక్కిళ్లని ఆమె జడలోని మల్లెలు తనివితీరా ముద్దాడాయి.

బస్సు కదిలిపోయింది.

''టాటా అంకుల్!'' భార్గవ్‌రామ్ చేయి వూపుతున్నాడు.

నేనూ చేయి ఊపాను.

★ ★ ★

జెడ్‌పి హైస్కూల్ ప్రక్కసందులోంచి ఇంటి దారి పట్టాను.

సాయంత్రం ఏడుగంటలు అయింది.

తన పట్టుకుచ్చులాంటి అందంతో నన్ను కట్టేసిన ఆమె రూపం నన్ను తొలిచేస్తోంది. నాకున్న వీక్‌నెస్ అదే 'అందమైన ఆడది.'

తెలిసినవాళ్ళు ఇద్దరు ముగ్గురు పలకరించడంతో వాళ్లని వదిలించుకునేసరికి పదినిముషాలు పట్టింది.

మా ఊళ్ళో నా ఆఫీసులో నేను ఎంతో సంస్కారవంతుడని పేరు తెచ్చుకున్నాను.

నాలో పైకి కనిపించని మచ్చ నా బలహీనత. ఆ మచ్చ పైకి కనిపించనంత కాలం నేను పవిత్రుడినే.

'మచ్చ'లేని మానవుడే వుండడేమో!

ఆలోచిస్తూ వానతో నిండిన గొయ్యిలో చూసుకోకుండా కాలేసాను. అది బాగా లోతుగా వుండడంతో ఎడమకాలు మడతపడి స్లిప్ అయిపడిపోయాను. బట్టలంతా బురదమయం. లేచి సరిగా నిలబడలేకపోయాను.

వీధిలో దూరం నుంచి వస్తున్న రిక్షా తప్ప ఆ సందులో నన్ను చూసినవారెవరూ లేరు. అమ్మయ్యా అనుకున్నాను.

కాలు బాగా నొప్పి చేసేసింది. కలుక్కుమంది.

ఒక్క అడుగు ముందుకు వేసేసరికి ఆ బాధ భరించలేక ఒక్క క్షణం అలాగే నిలబడిపోయాను.

పులిమీద పుట్ర అన్నట్టు రిక్షా నా ప్రక్కనుంచి వెళ్తూనే ఏదో బలమైన వస్తువు నా నుదుట బలంగా తాకింది. అంగుళం మేర చీరుకుపోయి ధారగా జలజలా కారుతున్న రక్తంతో చొక్కా తడవసాగింది.

రిక్షా చక్రం వల్ల స్లిప్ అయిన రాయి కాబోలు.

నా మెదడు మొద్దుబారిపోయింది. రక్తం అంటే నాకు విపరీతమైన భయం. హేండ్ కర్చీఫ్‌తో గాయం నొక్కిపట్టి ఎలా ఇల్లు చేరానో నాకే తెలియదు.

★ ★ ★

నుదుట మూడు కుట్లు పడ్డాయి.

కాలు బాగా నొప్పి చేసి వాచిపోవడం, జ్వరం కూడా రావడంతో వారం రోజులు లీవ్ పెట్టేశాను.

**కె. ఉదయబాబు**

